## హనుమంతుని గాధవింటే జ్ఞానం కలులుగుతుంది



వద్దిపర్తి పద్మాకర్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త :** త్రిభాషా మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనాలు సామాజిక సందేశాలు అని తెలంగాణ పోలీ సుహౌజింగ్ కార్పొరేటర్ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్త అన్నారు. వామ్ గ్లోబల్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో త్రిభాషా మహాసహస్రావధాని, ప్రణవపీఠాధిపతి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్‌చే 'హనుమాన్ మహిమ' అంశంపై రెండవ రోజు ప్రసంగ కార్యక్రమం కోఆర్డినేటర్ కౌటికె విఠల్, ఫోరం చైర్మన్ వి.బాబురావు, సెక్రటరీ జనరల్ పివి.రమణయ్య, కోశాధికారి మానేపల్లి రామారావు, ముఖ్యసలహాదారు చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా వద్దిపర్తి పద్మాకర్‌ను ఘనంగా సత్కరించి అభిందించారు. వద్దిపర్తి పద్మాకర్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో తల్లిదండ్రుల పట్ల అభిమానం, ప్రేమ, చూపక గుడులు, గోపురాలు దర్శిస్తున్నారని, అవసరం మించి డబ్బు కోసం పరుగులు తీస్తూ జబ్బులు కొనితెచ్చుకొనే వారికి హనుమంతుని గాధవింటే జ్ఞానం కలులుగుతుందని అన్నారు. రుగ్వేదం క్రమబద్ధంగా మాట్లాడే నేర్పునిస్తుందని, యజుర్వేదం ఉచ్ఛారణ దోషం లేకుండా చేస్తుందని, సామవేదం శ్రావ్యంగా మాట్లాడే విధానం కలిగిస్తుందని అని తెలిసిన వారు హనుమంతులు వ్యాఖరణ పండితులు కూడా అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం గ్లోబల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తంగుటూరి రామకృష్ణ, పబ్బతి రవికుమార్, సలహాదారు బంగారు సుబ్బారావు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు పబ్బతి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ వార్త

# వైన్స్ ముందే మందుకొడుతున్నారు..!

### - ఫుట్‌పాత్, సర్వీస్ రోడ్లపైనే తిష్టవేస్తున్న మందుబాబులు
### - అటుగా వెళ్లాలంటే జంకుతున్న మహిళలు
### -పట్టించుకోని పోలీస్, ఎక్సైజ్ అధికారులు



**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** నగరంలోని పలువైన్‌షాపుల ముందు మందుబాబులు బహిరంగ మద్యం సేవిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. మద్యంషాపు ముందున్న సర్వీస్ రోడ్డుపైనే మందుబాబులు కూర్చుని మద్యం సేవిస్తున్నారు. సాయంత్రం అయిందంటే చాలు ప్రాంతాలన్నీ జాతర తలపిస్తున్నాయి. అడిగేవారు లేకపోవడంతో మద్యం ప్రియులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. వైన్‌షాపుల వెనుకనే సిట్టింగ్ కోసం స్థలం ఉన్నామద్యం సేవించేవారు అక్కడికి వెళ్లకుండా షాపుముందే వారి ద్విచక్రవాహనాలను పార్క్‌చేసి అక్కడే మద్యం తాగుతున్నారు. అయినా షాపుల నిర్వాహకులు పట్టిచుకోకపోవడంతో రోజురోజుకూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారి సంఖ్య ఎక్కువవుతందని స్థానిక ప్రజలు అంటున్నారు. అది చాలదన్నట్లుగా సమీపంలోనే గోడలపక్కన మూత్రవిసర్జన చేస్తునా న్నరు. దీంతో ఆప్రాంత పరిసరాలు కంపు కొడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. నగంలోని సికింద్రాబాద్, అంబర్‌పేట్, గోల్నాక, కాచిగూడ, దిల్‌షుక్‌నగర్ ప్రాంతా ల్లో ఈపరిస్థితి ఎక్కువగా కనబడుతుంది. సాయంత్రం పూట మహిళలు అటువైపు రోడ్లపైకి రావాలంటే జంకుతున్నారు. పర్మిట్‌రూమ్‌కు స్థలం కేటాయించే నిర్వాహకులు వాహనాలకు మాత్రం పార్కింగ్ కేటాయించటంలేదు. దీంతో పార్కింగ్ ఎక్కడ చేయలో తెలియక రోడ్లపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో వాహనదారులు రోడ్లకు ఇరువైపులా వాహనాలను నిలుపుతున్నారు. ఆదీకాక వైన్‌షాప్‌నకు చుట్టు ప్రక్కల ఉన్న దుకాణాల ఎదుట వాహనాలు నిలుపుతుండటంతో వ్యాపారాలు చేసుకోలేక పోతున్నామని పలు దుకాణాదారులు వాపోతున్నారు. వైన్స్ షాప్ ముందు పార్కింగ్ క్రమబద్ధీకరించేందుకు కనీసం మనిషిని కూడా పెట్టండం లేదు. ఇప్పటికైనా అధికారులు సమస్యల ను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**పర్మిట్‌రూంలు ఉన్నప్పటికీ :** కొందరు మందుబాబులు మద్యం కొనుగోలు చేసి పర్మిట్‌రూమ్‌లలోకి వెళ్లకుండా బహిరంగ మద్యపానానికి పాల్పడుతున్నారు. చుట్టుప్రక్కల ఉన్న దుకాణాల ముందు కూర్చోని సేవిస్తున్నారు. దీంతో వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని స్థానికుల వాపోతున్నారు. రాత్రి అయితే చాలు మద్యం దుకాణాల ముందు నుండి వెళ్లాలంటే జంకుతున్నామని వాపోతున్నారు. వైన్‌షాప్ పరిసర ప్రాంతాలు రాత్రయితే అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతూన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# అనధికార లే అవుట్లపై రిజిస్ట్రేషన్ల శాఖలో అయోమయం



### - రెండు సర్క్యులర్ల అమలులో సబ్ రిజిస్ట్రార్లు సందిగ్ధత
### - తరుచూ జోక్యం చేసుకుంటున్న న్యాయస్థానాలు

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** అనధికారిక, అనుమతి లేని లే అవుట్‌లలో భూమి ఉన్నట్లయితే అలాంటి స్థలాలు రిజిస్ట్రేషన్లకు అనుమతించబడవని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన దరిమిలా అలాంటి వాటిని తప్పని సరిగాపాటించాల్సి న బాధ్యత స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖకు తప్పనిసరి అయింది. అయితే ఖజానాకు ఆదాయమే పరమావధిగా గ్రేటర్ హైదరాబాద్‌పరిధిలో కొందరు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు వాటిని పట్టించుకోకుండానే తమ పని తాము కానిచ్చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. భూములు, భవనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం హైకోర్టు తరుచూ జోక్యం చేసుకుని ఆదేశాలు జారీ చేస్తోంది. అయితే భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి ముఖ్యంగా తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019లోని సెక్షన్ 178(3) నుండి ఈసమస్య ఉత్పన్నమైనట్లు అధికారులు చెబుతున్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 113 (8) ప్రకారం అప్రూవల్ లే అవుట్‌లో భాగం కాని ఏ యజమాని లేదా డెవలపర్ అయినా భవన నిర్మాణ అవసరాల కోసం భూమిని విక్రయించకూడదు అన్న నిబంధనలు అధికారులు పాటిచంలేదని ఆరోపణలు ఉన్నాయి. కాగా 2019లో అప్పటి ఐజీ జారీ చేసిన ( జి2/257/ఈ/2019 సర్క్యులర్‌తో తీవ్ర అనిశ్చితి అయోమయం నెలకొంది. ఈ సర్క్యులర్ అమలుపై గ్రేటర్ హైదరాబాద్ తోపాటు రంగారెడ్డి, మేడ్చల్ జల్లాల రిజిస్ట్రార్లు ప్రభుత్వానికి క్లారిఫికేషన్ కోరుతు దరఖాస్తులు చేసుకొన్నాయి. ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. అదే విధంగా కోర్టు ఆర్డర్లు కూడా వీరిని ఇబ్బందులలోకి నెడుతున్నాయంటున్నారు. కోర్టులు ఆ సర్క్యులర్‌ల అమ లును తప్పుబడుతూ పలు రిట్ పిటిషన్లపై తీర్పులను ఇచ్చాయి. సబ్‌రిజిస్ట్రార్లు నిరాకరించిన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లను ఇండియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 1908 ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయాలని స్థానిక సంస్థలు, కొత్త పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలతో దీనికి సంబంధం లేదని కోర్టులు ఇచ్చి వాటిని అమలు చేయాలని ఆదేశిస్తున్నాయి. కోర్టు తీర్పులను అమలు చేసిన సబ్ రిజిస్ట్రార్లు నిబంధనల ఉల్లంఘనల పేరుతో సస్పెన్షన్‌లకు గురి అవుతున్నారు.

**సర్క్యులర్ల అమలుపై సందిగ్ధత :** కాగా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో తీవ్ర గందరదోళం నెలకొంటోంది. ఈ శాఖలో గతంలో జారీ చేసిన రెండు సర్క్యులర్ల అమలులో సబ్ రిజిస్ట్రార్లు సందిగ్ధతను ఎదుర్కొంటున్నారు. ఈ సర్క్యులర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తే న్యాయస్థానం జోక్యం చేసుకుని ఆ అధికారం లేదని కొట్టి పారేస్తూ సబ్ రిజిస్ట్రార్లకు ఒకింత చివాట్లు పెడుతున్నాయి. కోర్టు తీర్పులను అమలు చేసి డాక్యుమెంట్లపై నిర్ణయం తీసుకుంటే సబ్ రిజిస్ట్రార్లు నిబంధనలు ఉల్లంఘించారని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేస్తున్నారు. ఇలా సుమారు 10 మంది రిజిస్ట్రార్లు చిన్న పాటి కారణాలతో సస్పెన్షన్లకు గురయ్యారు. మరి కొందరిపైనా సస్పెన్షన్ కత్తి వేలాడుతోంది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్‌లో కొందరిపై వివిధ కారణాలతో సస్పెన్షన్‌కు గురి కాగా మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్ నల్లగొండ జిల్లాలో మూడు నుండి నలుగురు చొప్పున సస్పెన్షన్‌కు గురయ్యారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలోనూ మరి కొందరిని సస్పెండ్ చేసే దిశగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు సిద్ధమవు తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్ర ఖజానాకు ఈ శాఖ ఆయువుపట్టుగా ఉంది. కేవలం 141 రిజిస్ట్రేషన్ల కార్యాలయాలలో స్వల్ప సిబ్బందితోనే మార్చి ఏప్రిల్ మాసాల నుండి ఇప్పటి వరకు 7 లక్షల 14 వేల మూడు వందల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లతో రూ. 5070 కోట్ల రాబడినిఆర్జించిన ఈ శాఖ తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొం టోంది. రాష్ట్ర వ్యాప్తంగా చూసుకుంటే 595 సబ్ తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో ధరణి ద్వారా ఆదాయం సుమారు రూ. 1500 కోట్లు రావడం గమనార్హం. సర్కారు ఖజానాకు ఇంతగా కష్టిస్తున్న సబ్ రిజిస్ట్రార్లు కొత్త కొత్త నిబంధనలతో సతమ తమవుతున్నారు.

## మంచంపై నుంచి పడి చిన్నారి మృతి



పృథ్వీ చంద్ర ( ఫైల్ )

**అల్వాల్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** మంచంపై ఆడుకుంటూ కింద పడి బాలుడు మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గుంటూరు జిల్లా రేపల్లెకి చెందిన భార్యా భర్తలు దుర్గరావు, రవళిలు జీవనోపాధి కోసం నగరానికి వచ్చి అల్వాల్ రామచంద్రయ్య కాలనీలో నివాసం ఉంటున్నారు. దంపతులకు పృద్వి చంద్ర తొమ్మిది నెలల కుమారు ఉన్నాడు. బుధవారం తల్లి ఇంట్లో పని చేసుకుంటుండగా మంచంపై ఉన్న బాలుడు కింద పడ్డాడు. తలకు గాయం కావడంతో వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే చని పోయాడు. బాలుడి తండ్రి దుర్గారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా బాలుడి పోస్టుమార్టంకు తండ్రి నిరాకరించడం విశేషం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి వ్యక్తి మృతి



మృతుడు రాహుల్

**నేరెడ్‌మెట్ ఆగస్టు 3, ప్రభాతవార్త :** బిల్డింగ్‌పై నుండి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నేరెడ్‌మెట్ పోలిస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేరెడ్‌మెట్ పోలిస్టేషన్ పరిధిలోని ఆర్.కె పురం సీతారాం నగర్‌లోని శిల్పి రెసిడెన్సిలో బెంజిమెన్ కుటుంబ సభ్యులతో కలసి నివాసముంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీనా సాయంత్రం సమయంలో బెంజిమెన్ రెండవ కుమారుడైన రాహుల్ (22) అపార్టుమెంటులోని 4వ అంతస్థుపై నుండి ప్రమాదవశాత్తు కింద పడడ ంతో తీవ్ర గాయాలైన రాహుల్‌ను వెంటనే సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైదు ్యలు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

### భార్యతో సంబంధం పెట్టుకున్నాడని
## హత్య చేసిన వ్యక్తి అరెస్టు

**కంటోన్మెంట్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** స్నేహితుడే కట్టుకున్న భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడన్న కక్షతో నిర్మాణంలో ఉన్న భవనంలో మద్యం తాగించి దారుణంగా హత్య చేసిన ఓ వ్యక్తిని తుకా రాంగేట్ పోలీససులు అరెస్టు చేశారు. ఉత్తర మండలం అడిషనల్ డిసిపి వెంకటేశ్వర్లు బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్ ప్రాంతానికి చెంది న డిఫెండ్ బిశ్వాస్ (23), ప్రియాజిత్ నమసుద్ర అ నే ఇద్దరు స్నేహితులు పొ ట్టకూటి కోసం నగరానికి వలసవచ్చి తుకారాంగేట్ సాయి నగర్‌లో వేర్వేర్‌గా నివాసం ఉంటున్నారు. ప్రియాజిత్‌కు వివాహం కాగా భార్యతో కాపురం చేస్తూ సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే ఈ మధ్య కాలంలో తన భార్యతో డిఫెండ్ బిశ్వాస్ అక్రమ సంబంధం పెట్టుకొని, గత నెల 25వ తేదీన మహేంద్రహిల్స్ త్రిమూర్తి కాలనీలో నిర్మాణంలో ఉన్న 2 అంతస్థుల భవనంపైకి ప్రియాజిత్ నమసూద్ర డిఫెండ్ బిశ్వాసస్‌ను తీసుకొని మద ్యం తాగించి సెంట్రింగ్ కట్టెతో బిశ్వాసస్ తలపై మర్మంగంపై కొట్టి హత్య చేసి పారిపోయాడు. రెండు రోజుల వరకు కూడా బిశ్వాసస్ కనిపిం చకపోవడంతో అతని చెల్లెలు కవితా దాస్ తుకారాంగేట్ పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసుపెట్టారు. రెండు రోజుల తరువాత నిర్మాణంలో ఉన్న భవనం నుంచి దుర్వాశన వ్యాపించడంతో చుట్టుప్రక్కల వారు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి విచారించగా తమ భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నందుకే హత్య చేశానని నిందితుడి ఒప్పుకున్నాడు. నిందితుడు ప్రియాజిత్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును గోపాలపురం ఏసిపి సుధీర్ ఆధ్వర ్యంలో ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, ఎస్ఐ ప్రశాంత్‌లు దర్యాప్తు చేస్తున్నారు.



ససమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డిసిపి వెంకటేశ్వర్లు, ఇన్‌సస్పెక్టర్ ఎల్లప్ప



## నేడు కమాండ్ కంట్రోల్‌రూం ప్రారంభం
## బంజారాహిల్స్ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ భవనాన్ని నేడు ప్రారంభించ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈమేరకు జాయింట్ పోలీస్ కమిషనర్ ఎవి రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను రోడ్డు నంబర్ 12 బంజారాహిల్స్‌లో నిర్మించారు. దానిని సిఎం కెసిఆర్ ప్రారంభించనున్న నేపథ్యంలోనే గురువారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయమార్గాల్లో వెళ్ళాలని జాయింట్ పోలీస్ కమిషనర్ కోరారు. రోడ్ నంబర్ 12లో వాహనాలను ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అనుమతించరు. ఎన్‌టిఆర్ భవన్ నుంచి అపోలో ఆసుపత్రి, ఫిల్మ్‌నగర్, బంజారాహిల్స్ వచ్చే వాహనాలు జుబ్లీహిల్స్ చెక్‌పోస్టునుంచి రోడ్డు నంబర్ 36, రోడ్డునంబర్ 45 మీదుగా మాదాపూర్, సైబరాబాద్ వెళ్ళాలి. మాసబ్‌ట్యాంక్ నుంచి రోడ్‌నంబర్ 12, జుబ్లీహిల్స్‌వైపు వచ్చే వాహనాలు వయా మెహిదీపట్నం, నానాల్‌నగర్, టోలీచౌకి ,ఫిల్మ్‌నగర్, జుబ్లీహిల్స్ వైపు వెళ్ళాలి.

## శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు నిర్వహించిన రాష్ట్ర గవర్నర్

**చార్మినార్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ బుధవారం చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని సందర్శించారు.భాగ్యలక్ష్మీ మందిరం ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్‌కు స్వాగతం పలికారు.గవర్నర్ తమిళి సై అమ్మవారిని పూజించి ఆశీస్సులు పొందారు.మందిరం ట్రస్టీ శశికళ గవర్నర్ తమిళి సై సౌందర్‌రాజన్‌ను సన్మానించారు.పాతబస్తీకి గవర్నర్ విచ్చేసిన స ందర్బంగా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## సుదీర్ఘ గాన లహరిలో నాలుగు రికార్డులు సాధించిన తెలుగు గాయని నిర్మల

### గానకోకిల బిరుదును ప్రదానం చేసిన జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్



రికార్డుల పురస్కారం అందుకుంటున్న గాయని నిర్మల, చిత్రంలో దైవజ్ఞశర్మ, బాబుమోహన్, చిట్టిబాబు, శివపార్వతి తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఆగస్టు 3, ప్రభాతవార్త :** శ్రీపురుషోత్తం నిర్మల సాంస్కృతిక సంగీత సేవాసంస్థ ఆధ్వర్యంలో జాతీయ కళావేదిక రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మంగళవారం రాత్రి 6నుండి ఈరోజు బుధవారం రాత్రి 7గంటల వరకు 25గంటలపాటు జరిగిన సుదీర్ఘ గానలహరి సినీసంగీత విభావరిలో ప్రముఖ యువగాయని నిర్మల నిర్విరామంగా సహ గాయనీగాయకులతో కలిసి వివిధ తెలుగు, హిందీ సినిమాల్లోని ఆణిముత్యాల్లాంటి పాటలను ఆలపించి ప్రతిష్టాత్మక 4 రికార్డులను అందుకొని యావత్ తెలుగుజాతికే గర్వకారణంగా నిలిచింది. సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీనటుడు, మాజీమంత్రి బాబుమోహన్ విచ్చేసి ఆయా సంస్థల ప్రతినిధులు డా. బింగి నరేందర్‌గౌడ్, డా. లయన్ దేవేందర్, డా. ఎం.విజయలక్ష్మి, సాయిప్రియ తదితరులు 25గంటలపాటు కార్యక్రమాన్ని నిశితం గా పరిశీలించి నమోదుచేసిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, భారత్ వరల్డ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ గాయని నిర్మలను ఘనంగా సత్కరించి అందజేసి ఎంతగానో అభినందించారు. గాయని నిర్మల చేసిన సాహసం అమోఘం, నేటి భావితరాలకు ముఖ్యంగా యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దైవజ్ఞశర్మ, సినీనటుడు చిట్టిబాబు, ప్రముఖ సినీనటి శివపార్వతి తదితరులు పాల్గొని ప్రసంగించి 4 రికార్డులు సాధించిన గాయని నిర్మలను అభినందించి ము న్ముందు మరిన్ని రికార్డులు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించా రు. 25 గంటల సుదీర్ఘ గానలహరి నేటితో విజయవంతంగా ముగిసింది.

## తల్లి తండ్రులతో గొడవపడి యువకుడు ఆత్మహత్య

**ధర్నాచౌక్, ఆగస్ట్ 3, ప్రభాతవార్త :** తల్లి తండ్రులతో గొడవపడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ జహంగీర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం రాంనగర్‌లోని సౌమ్య హాస్పటల్ వద్ద నివసించే వేణు (26) మద్యానికి బానిసై, తల్లి తండ్రులైన కమల, కృష్ణలతో తరచుగా గొడవపడుతూ ఉండేవాడు. ఇటీవల కూతుళ్ల ఇంటికి కర్ణాటక వెళ్లిన వేణు కమల, కృష్ణలు ఈనెల 1 వ తేదీ హైదరాబాద్ వచ్చారు. బుధవారం మధ్యాహ్నం వేణు మద్యం సేవించి, తల్లి తండ్రులతో గొడవపడి వారిని ఇంటినుండి బయటకు పంపేశాడు. బయటకు వెళ్లిన కమల, కృష్ణలు సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి వేణు చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. చుట్టుపక్కల వారి సాయంతో వేణును గాంధీహాస్పటల్‌కు తీసుకుపోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తమ కుమారుడి మృతిపై తమకు ఎటువంటి అనుమానం లేదని, ఇది కేవలం ఆత్మహత్యేనని వేణు తల్లి కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

## సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం

**చిక్కడపల్లి :** సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.రమణ హర్షం ప్రకటించారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంలకు ధన్యవాదాలు తెలిపారు. గత 20 సంవత్సరాల నుంచి సంఘాల ఆధ్వర్యంలో 18న జయంతి ఉత్సవాలను జరుపుతున్నామని, మంత్రి గంగుల కమలాకర్, సిఎంకు పంపిన లేఖలో 18ని ప్రకటించారని, జీవోలో 8 చెప్పారని, ఇది మార్చాలని కోరారు.

## కాంగ్రెస్‌కి ద్రోహం చేసిన రాజాగోపాల్‌రెడ్డికి బుద్ది చెబుతాం

### - టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యంశ్రీరంగం

**వివేకానందనగర్‌కాలనీ, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ గుర్తు మీద నుంచి ఎన్నో పదవులు పొంది కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసిన రాజగోపాల్‌రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. కాంగ్రెస పార్టీ గుర్తు మీద గెలిచి పార్లమెంట్ సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా వివిధ హోదాలు కల్పించారన్నారు. మీ కుటుంబం కాంగ్రెస్ పార్టీ కుటుంబంగా కోమటిరెడ్డి కుటుంబం అంటేనే కాంగ్రెస్ పార్టీ కుటుంబం అని, నీ స్వార్థం కోసం పార్టీని విడిచి వెళ్ళిపోతూ అన్యాయంగా పార్టీకి జవసత్వాలు నింపుతున్న నాయకుడు రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడడం తగదన్నారు. రేవంత్‌రెడ్డి పిసిస అయిన కేవలం ఒక్క సంవత్సర కాలంలో అనేక సమస్యల మీద పోరాటం చేసాం అనేక జిల్లాల్లో పెద్ద పెద్ద బహిరంగ సభల్ని నిర్వహించి కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్ని, కాంగ్రెస్ పార్టీ నాయకుల్ని ఉత్సాహంగా ఉరకలెత్తించే విధంగా ప్రణాళిక చేసారన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులన్నీ ఒక్క తాటి మీదరక వచ్చి నీలాంటి దుర్మార్గ రాజకీయ నాయకులకు, స్వార్థ పరులకు తగిన బుద్ధి చెబుతారన్నారు.

# అవినీతిమయంగా ఇంజనీరింగ్ విభాగం

## చేతివాటం లేనిదే ఫైలు కదలదు - ఎస్ఈ పై అవినీతి ఆరోపణలు

## ఏసీబీ దాడుల నేపథ్యంలో ఇంజనీరింగ్ విభాగంలో భయం భయం



జోనల్ కార్యాలయం దృశ్యం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** ఇంజనీరింగ్ విభాగం లో చేయితడపందే ఫైలు కదలని పరిస్థితి. అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు గాలికి వదిలేసి జేబులు నింపుకోవడమే ధ్యేయంగా ఇంజనీరింగ్ విభాగం అధికారులు తమచేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. బిల్లు విడుదల చేయాలంటే వారి పర్సంటేజీ ముట్ట చెప్పాల్సిందే. లేదంటే చెప్పులు అరిగేలాగా కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం ఉండదు. ఇది ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగం అధికారుల పరిస్థితి. కాంట్రాక్టర్ కు ఇవ్వాల్సిన బిల్లు విడుదల చేసేందుకు లంచం అడిగిన ఇంజనీరింగ్ విభాగం సీనియర్ అసిస్టెంట్‌ను జులై 26వ తేదీన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సంఘటనే అందుకు నిదర్శనం. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్, ఆడిట్ అకౌంట్ సెక్షన్ లో విధులు నిర్వహిస్తున్న బండారి రమేష్‌కుమార్ హస్తినాపురానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ భూక్య రామకృష్ణ వద్ద నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కాంట్రాక్టర్ భూక్య రామకృష్ణ ఇటీవల భారత్ బెంజ్ నుంచి హయత్‌నగర్ ప్రధానరహదారివరకు రోడ్డు నిర్మించారు. రూ.12లక్షల రోడ్డు నిర్మించిన రామకృష్ణకు బిల్లు రావాల్సి ఉంది. అయితే బిల్లుకు సంబంధించిన అన్ని ఫార్మాలిటీస్ పూర్తిఅయ్యాయి. బిల్లుకు సంబంధించిన చెక్కు కోసం రామకృష్ణ సీనియర్ అసిస్టెంట్ రమేష్‌కుమార్‌ను కలవగా రూ.25 లంచం డిమాండ్‌చేయగా అందుకు రామకృష్ణ రూ.13.500 ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. కాంట్రాక్టర్ ఈ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఫిర్యాదుపై స్పందించిన ఏసీబీ అధికారులు రమేష్‌కుమార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఎల్బీనగర్ జోనల్ పరిధిలో గతంలో కూడా అనేకం చోటు చేసుకున్నాయి.

**లంచం ఇబ్బందే బిల్లు రిలీజ్ కాదు...** ఎల్బీనగర్ జోనల్ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో ప్రతి పనికి ఒక పర్సంటేజీ నిర్ణయిస్తారు. నిత్యం పనులు నిర్వహించే కాంట్రాక్టర్లు అధికారులతో ముందుగా ఒప్పందం కుదుర్చుకొని ఎవరి పనులు వాళ్ళు సాఫీగా చేసుకోవడం పరిపాటిగా మారింది. అధికారులకు ఇచ్చిన ఒప్పందం మేరకు లంచం కచ్చితంగా అప్పగించాల్సిందే. లేదంటే కాంట్రాక్టర్‌కు చుక్కలు చూపిస్తారు. ఇలాంటి సంఘటనలు జోనల్ సర్కిల్ కార్యాలయంలో కోకోల్లలుగా ఉన్నాయి. గత 3నెలల క్రితం కూడా ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ అశోక్‌రెడ్డిపై కూడా పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. కాంట్రాక్టర్లు పనులు ఎలా చేసినా అధికారులకు ఇవ్వాల్సిన ముడుపులు అప్పగిస్తే క్షేత్రస్థాయిలో కూడా పరిశీలన చేయకుండానే ఇంజనీరింగ్ విభాగం అధికారులు బిల్లులు విడుదల చేస్తారు. అవినీతి అధికారులు జోనల్ కార్యాలయంలో రాజ్యమేలుతుండడంతో కొందరు కాంట్రాక్టర్లు ఆడిందే ఆట పాడిందేపాటగా వ్యవహారం నడుస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులు ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ విభాగం అధికారులపై ప్రత్యేక దృష్టి సారించి లంచావతారాల ఆట కట్టించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# నేడు ఉప్పల్‌లో మహంకాళి బోనాల ఉత్సవాలు



ఉప్పల్‌లోని శ్రీ మహంకాళి దేవాలయం దృశ్యం

**ఉప్పల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జరిగే మహంకాళి బోనాల ఉత్సవాలు ఈ నెల 4వ తేదిన గురువారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలీసుఅధికారుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలని కమిటి నేతలు నిర్ణయించారు. ఆలయ కమిటి నిర్వహకులు మహంకాళి లక్ష్మన్, మహంకాళి నరసింహా, రాజుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద వివిధ ఏర్పాట్లు చేశారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలువురు పార్టీ నేతలు ఫలహార బండి ఊరేగింపు కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఉప్పల్ మహంకాళి దేవాలయం వద్ద ప్రత్యేకంగా స్వాగత వేదిక నిర్మాణం చేస్తున్నారు. పార్టీలకు అతీతంగా పలువురు పార్టీల నేతలను ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పలువురు యువజన సంఘాల ప్రతినిధులు, పార్టీల నేతలు ఫలహార బండి ఊరేగింపుకోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

**ఈదమ్మ దేవాలయంలో...** అదే విధంగా సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న ఈదమ్మ దేవాలయాలలో ఉత్సవాలు బోనాల ఉత్సవాలు ఏర్పాట్లు చేశారు. ఈదమ్మ ఆలయ కమిటి నేతలు గుమిడెల్లి నర్సింగ్‌రావు, జి.నరసింహా, జి.మల్లేష్, జి.యాదయ్య, జంగయ్య, పి.మల్లేష్, లక్ష్మయ్య తదితరుల ఆధ్వర్యంలో ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా భారీ ఏర్పాట్లు చేశారు. పోలీసులు ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.ఫలహార బండి ఊరేగింపు కోసం పోలీసుల అనుమతి తీసుకోవాలని సిఐ గోవిందరెడ్డి కోరారు.

# మహేశ్వరం నియోజకవర్గంపై బిఎస్‌పి జెండా ఎగురవేయాలి



బిఎస్‌పి ఇసి సమావేశంలో మాట్లాడుతున్న ఇబ్రాం శేఖర్

**సరూర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీని క్షేత్ర స్థాయి నుండి పటిష్టంచేసి వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల్లో పార్టీ పతాకాన్ని ఎగురవేయాలని బిఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పిలుపునిచ్చారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ గాయత్రీ నగర్‌లోనున్న విఆర్ గ్రాండ్ హోటల్‌లో మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బిఎస్‌పి తప్ప మరే పార్టీ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయదని అన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలోని గ్రామాల్లోకివెళ్లి పార్టీని క్షేత్రస్థాయినుండి నిర్మాణం చేయాలని సూచించారు. కలిసికట్టుగా అందరం కలిసి పని చేస్తే నియోజకవర్గ ఎమ్మెల్యే పదవిని సాధించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పంది లింగం, ప్రధానకార్యదర్శి గన్నోజి మహేష్‌చారి, మహేశ్వరం అసెంబ్లీ ఇంఛార్జి వత్తుల రాజు, మహిళా నాయకురాళ్ళు సంగీత, జ్యోష్ణ, నియోజకవర్గ నేతలు, మండలాల కన్వీనర్లు, డివిజన్, మున్సిపల్ అధ్యక్షులు, సెక్టార్, బూత్ స్థాయి కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అప్పుల బాధ తాళ లేక ఓ వ్యక్తి ఆత్మహత్య

**కుషాయిగూడ,ఆగస్టు 3 ప్రభాతవార్త :** అప్పుల బాధ తాళ లేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాప్రా ఆదిత్య నగర్ లో నివాసముండే చెన్నమరాజు గిరిధర్ వర్మ ( 40) గుంటూరు నుండి వ్యాపార నిమిత్తం గత కొన్ని నెలల క్రితం నగరానికి వచ్చి కాప్రా ఆదిత్యనగర్‌లో నివాసం ఉంటున్నాడు.కాగా ఈ నెల 3న బుధవారం రోజున ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఊరిలో ఉన్న భార్య ఫోన్ చేసినప్పటికీ ఎత్తకపోవడంతో సైనిక్‌పూరిలో నివాసముండే బంధువు ఎర్రమరాజు రవీంద్ర రాజుకు సమాచారం అందగా ఇరుగు పొరుగు వారి సహకారంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్లో ఓ వ్యక్తి వద్ద ఐదు లక్షల రూపాయలు అప్పు తీసుకొని తిరిగి ఇవ్వకపోవడంతో ప్రతినిత్యం సదరు వ్యక్తి గిరిధర వర్మను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు చెల్లించలేక మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# హరీష్‌రావు చేతుల మీదుగా టిపిఎస్‌ఎస్ వెబ్‌సైట్ ప్రారంభం



టిపిఎస్ఎస్ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీష్‌రావు

**సరూర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** బిసిల్లో బాగా వెనుకబడిన పూసల కులాన్ని ఎంబిసి జాబితాలో చేర్చాలని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును కోరారు. తెలంగాణ పూసల సంక్షేమ సమితి సభ్యుడు పనీన్రు సతీష్ రూపొందించిన వెబ్‌సైట్‌ను కోల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు మంత్రితో ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వ్యాపారాలు చేసుకునే పూసల కులస్తులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయించాలని మంత్రిని కోరారు. ముఖ్యంగా పూసల కులాన్ని ఎంబిసిలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమితిఅధ్యక్షుడు లక్కరాజుల సుబుద్ధి, పగిడిపల్లి బాలయ్య, తన్నీరు వెంకటేశం, పొదిల సుదర్శన్, పొదిల అజయ్, సాయిబాబు, శేని వెంకటేషం, కంచి మధుసూదన్, కోనేటి జీడికల్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి : నవజీవన్‌రెడ్డి



మొక్కలు నాటిన నవజీవన్‌రెడ్డి, డీసీ కాలనీవాసులు

**హయత్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టడానికి చెట్లను నరకడంవల్ల కాలుష్యంపెరిగిపోతోందని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, డీసీ మారుతీదివాకర్ అన్నారు. దీంతో స్వచ్ఛమైన గాలిని సైతం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తోందని దీనిని నివారించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలనునాటి పచ్చదనాన్ని పెంపొందించాలని వారు సూచించారు. డివిజన్ పరిధిలోని ఉషోదయకాలనీలో నిర్వహించిన హరితహారంలోభాగంగా కాలనీవాసులతో కలిసి ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న తరుణంలో మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా భవిష్య తరాలకు ప్రాణవాయువును అందించేందుకు ప్రతిఒక్కరు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి రవీందర్‌రెడ్డి, సభ్యులు బుచ్చిరెడ్డి, రాంరెడ్డి, నాయకులు ఉగాది ఎల్లప్ప పాల్గొన్నారు.

# రామోజీ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయం



అగ్నిమాపక కేంద్రం ప్రారంభోత్సవంలో హోంమంత్రి మహమూద్ అలీ, విజయేశ్వరి, ఎమ్మెల్యే, నాయకులు

**హయత్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** రామోజీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలు అభినందనీయమని హోంమంత్రి మహమూద్ అలీ, ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లో రామోజీ ఫౌండేషన్‌వారు 1.50కోట్ల రూపాయాలతో నిర్మించిన అగ్నిమాపక కేంద్రాన్ని బుధవారం వారు మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, డాల్ఫిన్ హోటల్స్ ఎండీ విజయేశ్వరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ... 1993లో నిర్మించిన భవనం శిథలావస్థకు చేరడంతో పరిస్థితిని తెలుసుకున్న రామోజీ ఫౌండేషన్ నూతన భవన నిర్మాణానికి ముందుకు రావడం, 8 నెలల్లోనే దానిని పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలో ఇప్పటికే ఆర్డీవో కార్యాలయం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణంతో పాటు సమీప గ్రామాల ను దత్తత తీసుకుని వాటి అభివృద్ధికి రామోజీ ఫౌండేషన్ కృషిచేస్తోందన్నారు. అగ్నిమాపక సిబ్బంది అనునిత్యం అప్ర మత్తంగా ఉంటూ ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. శైలజాకిరణ్,విజయేశ్వరి మాట్లాడుతూ ప్రజోపయోగ పనులను చేయడానికి రామోజీ ఫౌండే షన్ ఎల్లవేలలా సహకరిస్తుందన్నారు. డివిజన్‌లోని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిం చాలని కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యగ్గె మల్లేష్, ఫైర్‌సర్వీసెస్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, అడిషనల్ డైరెక్టర్ నారాయణ, ఫైర్‌ఆఫీసర్ శీనయ్య పాల్గొన్నారు.

# నూతన రోడ్డు నిర్మించాలి : పవన్



రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో కాలనీ పూర్తిగా బురదమయంగా మారిందని వెంటనే నూతన రోడ్డు నిర్మించే విధంగా చర్యలు చేపడతామని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేటడివిజన్ కమర్షియల్‌టాక్స్ కాలనీ రోడ్ నెంబర్ 4లో బుధవారం కార్పొరేటర్ పర్యటించి సమస్యను పరిశీలించారు. వర్షాకాలంలో రోడ్డుపైన నీళ్లు ఆగిపోతుండ దంతో బురదగా మారి ఇబ్బందికరంగా పరిస్థితి నెలకొందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండ నూతన సీసీ రోడ్డును ఏర్పాటు నిర్మించాలని ఇంజనీరింగ్ ఏఈ మాతృనాయక్‌ని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అంజయ్యగౌడ్, రాజు, రవీందర్, విశ్వేశ్వర్‌రావు, ఠాకూర్ అక్షయ్‌సింగ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

# సదానందం కుటుంబానికి న్యాయం చేయాలి : గోపాల్‌రెడ్డి

**సరూర్‌నగర్,ఆగస్టు 3 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుడు మీసాల సదానందం కుటుంబానికి కార్పొరేషన్ తరపున న్యాయం చేయాలని కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సదానందం కుటుంబానికి మద్దతుగా గోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మున్సిపల్ కార్పొరేషన్‌కు తరలి వచ్చి జరిగిన దుర్ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పేద దళిత కుటుంబానికి చెందిన సదానందం మృతితో ఆయన కుటుంబం రోడ్డున పడిందనీ ఈ మేరకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి సదానందం పెద్ద కుమార్తెకు కార్పొరేషన్‌లో ఉద్యోగంఇచ్చి చిన్నకుమార్తె చదువుఖర్చును భరించాలని డిమాండ్ చేశారు. సదానందం కుటుంబానికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# నల్ల పోచమ్మ ఆలయంలో చండీహోమం

**సరూర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అయోధ్యనగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో బుధవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ దాత, స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్ దంపతులు భక్తి శ్రద్ధలతో ఆలయంలో చండీ హోమం జరిపారు.హోమం అనంతరం పూర్ణాహుతి, మంత్రపుష్పం కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో అయోధ్య నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధికి సహకరిస్తాం



లక్ష్మీ నగర్ కార్యవర్గాన్ని అభినందిస్తున్న కార్పొరేటర్

**కుషాయిగూడ, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కాలనీల అభివృద్ధికి పూర్తిగా సహకారం అందిస్తామని మీర్పేట్ డివిజన్ కార్పొరేటర్ జేరిపోతుల ప్రబుదాస్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్పేట్ డివిజన్ లక్ష్మీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుతూ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షులు రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి కోటిరెడ్డి, కోశాధికారి రామ్‌రెడ్డి, కార్యదర్శులు బిఎస్ఆర్ మూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, యాదవరెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గుండారపు శ్రీనివాస్ రెడ్డి, కామేశ్వరరావు రాజేశ్వరరావు సుబ్బారెడ్డి వెంకటరెడ్డి నిస్సార్ అహ్మద్ గోరి తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ అనితానాయక్

**మలక్‌పేట, ఆగస్టు 3 ప్రభాతవార్త :** విధి నిర్వహణలో సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్ గేట్ల వద్ద వాహనాల రాకపోకలు తనిఖీలు సరిగా నిర్వహించాలని సూచించారు. ప్రతి వాహనాన్ని తనిఖీలుచేసి ఇన్‌వాయిస్ సరిగా ఉన్నాయ లేదా అనే విషయాన్ని సరి చూసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం వీధులలో ఉన్న సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సానిటేషన్ సమస్యలపై డిప్యూటీ మేయర్‌కు వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న న్యూ ఆర్యనగర్ బస్తీవాసులు

**తార్నాక, ఆగస్టు 3 ప్రభాతవార్త:** తార్నాక డివిజన్ పరిధిలోని న్యూఆర్యనగర్‌బస్తీలో డ్రైనేజీ, సానిటేషన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డికి స్థానికులు వినతిపత్రాన్ని అందజేశారు. సంభందిత అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడంలేదని ప్రజలు డిప్యూటీ మేయర్‌కు ఫిర్యాదు చేశారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో స్థానికులు ఎండి. ఫర్వేజ్, పద్మ, జాలమ్మ, సువర్ణ, జోసఫ్, రాఘవేంద్ర, రమేష్, శ్రీనివాస్ తధితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సిబ్బందిపై చేయి చేసుకున్న వారిపై కేసు నమోదు

**కుషాయిగూడ,ఆగస్టు 3 ప్రభాతవార్త :** డ్యూటీలో ఉన్న ఆర్టీసీ బస్సు సిబ్బందిపై చేయి చేసుకున్న ఆటో డ్రైవర్ల పై కేసు నమోదుచేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 16 ఏ టీఎస్‌ఆర్టీసీ బస్సు ఈసీఐఎల్ నుండి సికింద్రాబాద్కు వెళుతుండగా ఈసీఐఎల్ చౌరస్తాలో హ్యాపీ మొబైల్స్ వద్ద అడ్డుగా ఆగిన రెండుఆటోలు అడ్డు జరగకపోగా ఆర్టీసీ బస్సులోకి చొరబడి బస్సు డ్రైవర్‌పై ఆటోడ్రైవర్ దాడి చేయడంతో బస్సు డ్రైవర్‌కు ముక్కుపై తీవ్రగాయమైంది. దీంతో కండక్టర్ సంపత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి దిగిన ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మలక్‌పేటలో ఘనంగా నాగుల పంచమి పూజా కార్యక్రమాలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు, నిర్వాహకులు తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 3 ప్రభాతవార్త :** మలక్‌పేటలో ఘనంగా నాగుల పంచమి పూజా కార్యక్రమాలు జరిగాయి. నాగుల పంచమి సందర్భంగా ఓల్డ్ మలక్‌పేటలోని పోచమ్మ దేవాలయంలో ఉన్న పాముల పుట్టలో మహిళ భక్తులు పాలు పోసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తమ మొక్కులను సమర్పించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, పిటి శంకర్‌ముదిరాజ్, తులసి సురేష్‌కుమార్, మల్లికార్జున ఆలయ ఛైర్మన్ చౌకి రవికుమార్, ముప్పిడి శ్రీనివాస్, చౌకి రాజు, రాజేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడ్డ ట్రాక్టర్ డ్రైవర్‌ను ఆదుకోవాలి



శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శిస్తున్న సిఐటియు, సిపిఎం నాయకులు

**సరూర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** విధి నిర్వహణలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సానిటేషన్ ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డికి కార్పొరేషన్ న్యాయం చేయాలని సిఐటియు, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం రంగారెడ్డి జిల్లా సిఐటియు అధ్యక్షుడు జగదీశ్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, బాలాపూర్ మండలాధ్యక్షుడు దాసరి బాబు,మండల సిపిఎం కార్యదర్శి యాదయ్యలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి గాయాల నుండి కోలుకునేంత వరకు పూర్తి వేతనమివ్వాలనీ అదే విధంగా వైద్య ఖర్చులను కార్పొరేషనే భరించాలని సూచించారు. అతనికి న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని వారు స్పష్టం చేశారు.

# రాజగోపాల్‌రెడ్డి చిత్రపటాన్ని దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రాజగోపాల్‌రెడ్డి చిత్రపటాన్ని తగుల బెడుతున్న శ్రీపాల్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** స్వంతలాభం కోసమే రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారని చంపాపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి చేసిన అనుచిత వాఖ్యలు నిరసిస్తూ ఆయన చిత్రపటాన్ని తగులబెట్టారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం కమిషన్లు, స్వంత లాభం బిజెపిలో చేరుతున్న రాజగోపాల్‌రెడ్డి గతాన్ని మరిచి ఇప్పుడు రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మొగలి పువ్వు నారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి తోకటి కిరణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బిట్టు చిరంజీవి, కారుకొండ శివ, రమేష్ ముదిరాజ్, జంగయ్యగౌడ్, వెంకటేష్, రెండ్ల శివ, అడెల రాజా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# దళితబంధు పథకం పేదలకు వరం : ఎమ్మెల్యే మైనంపల్లి



దళితబంధు ద్వారా మంజూరైన లేడీస్ ఎంపోరియంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు..

**నేరెడ్‌మెట్, ఆగస్ట్ 3 ప్రభాతవార్త :** దళితబంధు పథకం పేద ప్రజలకు ఓ వరం లాంటిదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. బుధవారం మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని వినాయక్‌నగర్ డివిజన్ గౌరీశంకర్ అపార్టుమెంటు వద్ద దళితబంధు పథకం ద్వారా మంజూరైన లేడీస్ ఎంపోరియంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధుపథకం పేద ప్రజలకు ఓ వరంలా మారిందన్నారు. సమాజంలో పేదలకు తమ కంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవడం కోసం దళితబంధు పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.దళితబంధు పథకం ద్వారా ఎంతోమంది లబ్దిదారుల జీవితాల్లో ఆనందాలు నింపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, ఇడి బాలాజి, మాజీకార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నాయకులు పిట్ల శ్రీనివాస్, రాముయాదవ్, గుండా నిరంజన్, ఉపేందర్ రెడ్డి, సూరి, పరీద్, చంద్రకాంత్, బాలక్రిష్ణ, లత, మీనా, కుమారి, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# రామంతాపూర్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**రామంతాపూర్,ఆగస్టు 3 ప్రభాతవార్త :** రామంతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ రాములు తెలిపారు. గోఖలేనగర్ 11 కెవి ఫీడర్ పరిధిలోని ప్రగతినగర్, ఇందిరానగర్, నెహ్రునగర్, చర్చికాలనీ గోదాం,గోఖలేనగర్, 11 కెవి గణేష్ నగర్ పీడర్‌పరిధిలోని ప్రధాన రహదారి, స్వాగత్ గ్రాండ్, సిడిటిఐ, లక్ష్మినగర్ పీడర్ పరిధిలోని లక్ష్మినగర్, సాయిచిత్ర నగర్, శారధనగర్, పాత రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

# స్వంత నిధులతో కాంపౌండ్ వాల్ నిర్మాణం : కౌన్సిలర్ స్వాతి

**తుర్కయాంజాల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని మునగనూర్ గ్రామం 15వ వార్డులోని ఎస్సీ బస్తీలోని పోచమ్మ గుడికి తమ సొంత నిధులతో నిర్మించనున్న కాంపౌండ్ వాల్‌కు 15వ వార్డు కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోమలపల్లి ప్రమీలలక్ష్మయ్య, మాజీ ఉపసర్పంచ్ దోమలపల్లి అంజయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు దోమలపల్లి రమేష్, వేముల భాస్కర్‌రెడ్డి, 15వ వార్డు టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శివకుమార్, మహేందర్, జంగయ్య, పాండు, నరసింహ, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్య పరిష్కరించండి



ఎండి దానకిషోర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ చేతన

**ఉప్పల్,ఆగస్టు 3 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ రవీంద్ర నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ కోరుతూ బుధవారం స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన జలమండలి ఎండి దానకిషోర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రవీంద్ర నగర్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, అవుట్‌లెట్ లేక మురుగునీరు చెరువులో కలుస్తుందని ఫిర్యాదు చేశారు. దీని కారణంగా చెరువు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో దుర్వాసనలు వస్తున్నాయని, చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతున్నాయని తెలిపారు. సమస్య పరిష్కారానికి నిధులు విడుదల చేయాలని సూచించారు. దీనిపై జలమండలి ఎండి దానకిషోర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

# సిపిఐ జిల్లా సభ్యుడిగా బాతరాజు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా భారతరాజు నరసింహాను ఎన్నుకున్నారు. షాద్‌నగర్‌లో జరిగిన పార్టీ 16వ మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయకార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పాల్గొని కమిటీని ఎంపిక చేశారు. ఆర్‌కె పురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన బాతరాజు నరసింహను ఎన్నుకోవడం పట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# కార్మికుల మహాధర్నాకు తరలిన సిఐటియు నాయకులు

**తుర్కయాంజాల్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కార్మిక సమస్యల పరిష్కారానికై సీఐటీయూ అధ్వర్యంలో ఆగస్టు 3న జరిగే ఛలో హైదరాబాద్, కార్మికుల మహాధర్నాకు తుర్కయంజాల్ సిఐటియు నాయకులు,వివిధ పరిశ్రమల కార్మికులు బయలుదేరారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ పరిశ్రమల కనీస వేతనాల జీవోలను సవరించాలని, విడుదల చేసిన ఐదు జీవోలను వెంటనే గెజిట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమానికి తుర్కయంజాల్ ప్రాంతం నుండి సిఐటియు నాయకులు కార్యకర్తలతో పాటు ఈ ప్రాంతంలో వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి.కిషన్ నాయకులు గుర్రం జంగయ్య, కొండిగారి శంకర్, పగిళ్ల మధు, నక్కల్ల యాదగిరి, సాయి, అహ్మద్, తదితరులు ఉన్నారు.